# సుంకమ్మ ఎనుము

"సుంకమ్మోవ్!" అని గొంతు పగిలిపోయేతట్టు అర్సినాడు జంగిడోడు. ఏంటియో దంచుకుంటావున్న సుంకమ్మ 'ఏంది ?' అన్నెట్టు సూసింది. "నిరనీ ఎరెనుమును పొరపోట్ల దురిదుర్తి కరకాడ సురసూస్తి" అన్నాడు జంగిడోడు. ఎవురికీ అర్తంగాని బాస మాట్లాడాల్నని వానికి బోసంబరం. అదేం పెద్ద అర్తంగాని బాస గాదు గనక ఎవురికన్నా అర్తమైతే "ఒరే ! నీకూవస్తాదే యీ బాస" అని ఆచ్చెర్యపోతాడు. సుంకమ్మకు వాని బాసను అర్తం జేసుకోవాలనిపిచ్చలా. అందువల్ల యిసుగ్గా "పోరా... అవులయనాబట్టా" అని తిట్టింది. అప్పుడు జంగిడోడు జంగిడి బాసను మానుకోని, అందరి బాసలోకొచ్చినాడు. "నిన్న పొద్దుటూరుకు సిల్మాకనిపోతా పోట్లదుర్తి కాడ నీ ఎనుమును సూసినానమ్మా" అన్నాడు.

"ఆ వూళ్ళో ఎట్టుంటాది నా ఎనుము" అనడిగింది సుంకమ్మ. దాన్తో జంగిడోనికి రోంత జర్రుమంది. "ఎట్టుంటాదో నాకేం తెల్సు ? వుండాది మల్ల .... ఎట్టుంటాది ? అని నువు దీరిగిచ్చి అడిగితే ఏంజెప్పేది ?" అన్నాడు. అని, "నా పెండ్లాం తాలిబొట్టుతోడు, పిల్లల్తోడు ! లోటు మీంద నుంచీ పరమట ఇసికలో పండుకోనుండే ఎనమల్దిక్కు ఎందుకో గానీ అట్టా సూసేతల్కి .... ఎందుకో ఏందిలే జంగిడోనికి యాడికిబోయినా ఎనమలమిందనేగదా కన్ను ... ఏందిరా ఇది సుంకమ్మెనుమాల వుండాదే అనుకోని పోయి సూస్తే.... యింగేముంది ? నీ ఎనుమును నేను కనుక్కోలేనంటావా ?" అంటూ సెప్పుకొచ్చినాడు.

నిజమే, జంగిడోడు తనెమును కనుక్కోలేడా ? అయితే. ఇంగా తన కేమో నమ్మకం ల్యాకుండా వుంది. మల్లా తనెనుము కండ్లపడ్తాదని కల్లో గుడకా అనుకోలా. అది పోయి ఇప్పటికి ఆర్నెల్లుదాటె. మూన్నెల్లు కాలిక్కాలికి కొట్టుకుంటా కన్నవూళ్ళన్నీ తిరిగినా కనపడకపాయె. యాడ అడిగినా దాని పోబడే సెప్పినోల్లు ల్యాకపోయిరి. "నీకూ దానికీ రుడం తీరింది. ఇంగూరుకో" అని నలుగురూ సెప్పిరి. సేసేదిల్యాక తనూ ఆసిడ్సిపెట్టె.

జంగిడోడు సెప్పినాక ఇంగ సుంకమ్మకు నిద్దరపట్టలా. పట్తే ..... అందులోగుడకా తనెనుమే కనపడ్తా వుండె. తను దగ్గిరికి వస్తే అది ఓరగా సూసి తోకాడిస్తా మూతిసాపి తనకేసి రాసుకునేదీ, "త్రుప్పయ్ ... దాదా .... త్రుప్పయ్" అని పిలిస్తే ఏట్లో వున్నా అర్సుకుంటా పరిగెత్తుకుంటా వచ్చేదీ ... ఇట్టా రకరకాలుగా గ్యాపకమొచ్చింది. ఎప్పుడెప్పుడు తెల్లవార్తాదా అని ఎదురుసూసింది. జంగిడోడు సెప్పినప్పుడు తనెనుము పోట్లదుర్తిలో ఎందుకుంటాదన్న సుంకమ్మ, ఇప్పుడు అది తనెనుము కాకపోతేనో .... అని గూడా అనుకోల్యాకపోతాంది. తనెనుమేనంట ! జంగిడోడు సెప్పలా .... వానికి తెల్దా ? అయితే బాగా సతవయిందంట. వున్నోళ్ళ ఇంట్లో వుందన్నమాట. ఆ వున్నోళ్ళకేం రోగం ? వుపరా సొమ్ము దొరికిందని, వూళ్ళో వొంటెనుమును గూడా వున్నిచ్చుకోడమేనా ?

తెల్లవార్నాదో లేదో ఆమొయిన సుంకమ్మ పోట్లదుర్తి దావబట్టె. "యాడికే సుంకమ్మా, ఇంత పొద్దన్నే

పోతాండావు ?" అని వూరిముందు ఒకరిద్దరు అడిగితే, రోంత తటపటాయిచ్చి, మల్లా వొచ్చి సెప్తా అంటా బెరబెరా నడ్సె. పొద్దనపూట ఎనుములు ఏట్లోకి దిగుతానే పోయి సూడాలని సుంకమ్మ ఆలోసెన. పోట్లదుర్తి కాడ ఏట్లో ఎన్నెనుమల జూసినా తన కోరుకొమ్ముల ఎనుము కనపడకపాయె. "ఏట్లోకి యిడ్సినారో లేదో దొంగపియ్యి తినేవాళ్ళు" అనుకుంటాండంగా, ఆ వల్లకు నిలబడుకోని కనబడె !

ఇన్నాళ్ళకు తనెనుమును మల్లా సూస్తావుంటే కండ్లల్లో నీళ్ళు తిరిగె సుంకమ్మకు, "కోరుకొమ్ముల్దానా, యీడుండావా ! నీ కోసం ఎంత ఎతికి ఎతికి సచ్చిపోతినే ...." అని ఏడ్సుకుంటా జరిగిన కతంతా ఎనుముకు సెప్పబట్టె. అయితే, అది ఇంటాన్నెట్టేలేదు, ఆయిగా నెమరేస్తావుంది. "సెప్పుకో.. సెప్పుకో సెవుగోస్కో" అన్నెట్టు లెక్కాజమా ల్యాకుండా వుంది. దాని పయిమీద సెయ్యేసి నిముర్తా వుంటే, మెత్తంగ దాని యీపు సుంకమ్మ సేతికి తగుల్తా వుంది. ఇంతకుముందు యిట్ట సెయ్యేస్తే దాని మక్కి మీదుండే బోటెంకలు తగిలేటియి. అప్పుడది తనెనుము అనిపిచ్చేది. ఇప్పుడేందో కొత్తదానాల వుంది.

ఇంతలో "ఏయ్, కొత్తెనుమా ! లే..." అంట ఒక పిల్లోడు బఱ్ఱ తీసుకోనివచ్చి దాన్ని ఒకటేసె, "యీ యెనుము యెవర్దబ్బీ?" అనడిగితే "ఈసరయ్య నాయున్ది" అని ఆ పిల్లోడనె. "వాళ్ళకు యాడ్డి ? కొనుక్కున్నారా ? ఇంటిదేనా ?" అనడిగితే, "నాకు తెల్దు, వాళ్ళనే అడుగుపో" అంటా ఆ పిల్లోడు దాన్ని తోలకపాయె. ఆ మొయిన "ఈసరయ్యనాయుని ఇండ్లాడ?" అని అడుగుతా అడుగుతా బోయి సుంకమ్మ ఒకింటికాడ నిలబడె.

ఆ ఇండ్లు దర్జాగా ఇప్పుడు సతవైన కోరుకొమ్ముల ఎనుమాల వుంది. అసుమంటి ఇండ్లున్నోళ్ళు తన భక్కెనుమును కట్టేసుకుని, సతవ జెయ్యడం శానా అన్నాయం అనిపిచ్చె సుంకమ్మకు. అందుకే రోంత గట్టిగా అర్సినట్టు తనెనుమును కట్టేసుకున్నారని మాట్టాడె. నలుగురూ యింటాండంగ ఏరూరుమనిషి అట్టనడంతో ఆ ఇంటోళ్ళకు బోకోపమొచ్చింది. ఈసరయ్యనాయుని పెండ్లాం సెలకోలుతో ఒక్క టేసింది.

తనెనుమును కట్టేసుకోని, తన్నే కొట్టారని సుంకమ్మ నలుగురికీ సెప్పబట్టె. మల్లా వూరికిబోయి జంగిడోనీ, యింగా యిద్దర్నీ తీసకొచ్చి అది తనెనుమని సెప్పిచ్చె. తనెనుము కాకపోతే యీమె యింత సేస్తాదా ? అని కొందరనుకోబట్రి. ఆ ఎనుము వాళ్ళ తోట్లో పన్నాదని ఈసరయ్యనాయుడు కట్టేసుకున్నాడని, వూళ్ళో జీతగాళ్ళు అన్రి. యిట్ట సుంకమ్మెనుము పంచాతి పెట్టిచ్చె.

ఏమనుకున్నాడో ... ఏమోగానీ ఈసరయ్యనాయుడే, సుంకమ్మను నలుగురి ముందుకు రమ్మనె. "ఎనుము మాదని మేమంటావుంటే నీదని నువ్వంటావుండావు. దీనికి నేనొక తీరుపుజెప్తా ... యిను. ఎనుమును మీ వూరికీ మా వూరికీ మద్దెన నడేట్లో ఇడ్సిపెడ్దాము. నీ ఇంటికొచ్చెనా నీది, మా ఇంటికొచ్చెనా మాది. దీనిమీదింగ తిరుగుండగూడ్దు. వొప్పుకుంటావా ?" అని అడిగినాడు. 'ఇందులో

ఏదో వుండాదిరా' అని సుంకమ్మకు బయమయింది. తనెనుమును పట్టుకోని నీ ఇంటికొస్తే నీది, నా యింటికొస్తే నాది అంటే ఎట్ట ? అయితే, సుంకమ్మ వాదన ఆ నలుగురూ యినలా. ఇది బాగానే వుందనిరి.

ఇంగ వొప్పుకోకతప్పలా సుంకమ్మకు. తనొప్పుకోకపోతే, తన దిక్కు ఇంగెవరూ సెప్పరు. ఒప్పుకోక సేసేది మాత్రం ఏముంది ? ఇట్టనన్నా ఏదో ఒకటి తేల్తాదిగదా ... అనుకుంది. లోపల్లోపల "దేవుల్లేడా ? నాయం గెల్చకుండా వుంటాదా ? తనెనుము తన్ని మర్సిపోతాదా ? తనంటే అంతబెమగా వుండేదే ?" అనుకుంది.

పరీచ్చరోజు వచ్చింది. ఎనుమును ఈసరయ్య జీతగాడు తలుగుతో పట్టకపోయి నడేట్లో యిడ్సిపెట్టినాడు. దూరంగా ఆ పక్క యీ పక్కా సూస్తా నిలబన్నారు. సుంకమ్మ కండ్లార్పకుండా సూస్తా వూపిరి బిగబట్టి, పానమంతా ఒకెత్తుజేసుకోని సూడబట్టింది. కోరుకొమ్ములెనుము కొమ్ములూంచుకొంటా నేరుగా వచ్చిన్దావపట్టింది. సుంకమ్మ ఎర్రిదయిపాయె. "ఒసే, నా సవితా ? నన్ను ఎంత మోసం జేస్తివే ! వాళ్ళు నీ కడుపుకు సించబెడ్తా వుండారని యీ ముండ నీకేం బెట్తాదని అనుకోని యిట్ట జేస్తివిగదనే" అంట తిట్టబట్టె. తిట్లయినాక ఏడ్సుకుంటా ఇసికలో కూలబడిపాయె. నాయుడు ఈ తీరుపును ఎందుకంత దీమాగా సెప్పినాడో, తనకెందుకంత బయమయిందో ఇప్పుడు సుంకమ్మకు అర్తమాయె.

నాయం నేరుగా యీసరయ్యనాయుని ఇంటికి పాయె. సుంకమ్మ ఇంగ అది తనెనుమేనని గుడకా సెప్పుకోల్యాకపోయె.